
కొణిజర్ల : రోడ్డుపై అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న పోలీసులు


సత్తుపల్లి :ఓసీలో నిలిచిన నీరు


కొత్తగూడెంలో కురుస్తున్న వర్షం


పాల్వంచ రూరల్ :సోములగూడెంలో ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు


దుమ్ముగూడెం: ధాన్యం రాశులపై కప్పిన పరదాలు


అన్నపురెడ్డిపల్లి : కల్లంలో ధాన్యం
రాశుల పై నిలిచిన నీరు


బూర్గంపహాడ్ : అంజనాపురంలో ధాన్యం రాశులు తడవకుండా కప్పి ఉన్న పరదాలు


అశ్వారావుపేట రూరల్ :తిరుమలకుంటలో తుపాన్‌కు తడిసిన వేరుశనగ


అశ్వారావుపేట టౌన్ :ధాన్యం రాసులు తడవకుండా పరదాలు కప్పిఉంచిన రైతు


దుమ్ముగూడెం : ధాన్యం రాశుల పక్కన వర్షపునీటిని తొలగిస్తున్న రైతు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 'మిచౌంగ్' ప్రభావం
- కొనసాగుతున్న రెడ్‌అలర్ట్
- పత్తి, మిర్చి, వరి పంటలకు తీవ్రనష్టం
- మరో రెండురోజులు వర్షాలకు చాన్స్
- విద్యాసంస్థలకు నేడు కూడా సెలవు

# రోజంతా వాన

## జనం హైరానా

ఖమ్మం, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లాపై స్పష్టంగా కనపడింది. సోమవారం రాత్రి నుంచి ఒక్కసారిగా వానముసురు ప్రారంభమైంది. తెల్లవారుజామున ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వాన ముసురు వీడలేదు. ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి ఖమ్మం నగరం తడిసి ముద్దైంది. ప్రధానవీధులన్నీ జలమయం కావడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. నాలాలు పొంగడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి చేరింది. పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. నగరంలో పరిస్థితి ఇలా ఉండగా.. పల్లెల్లో మరోవిధంగా కనిపించింది. ప్రస్తుతం వ్యవసాయ పనులు జోరుగా కొనసాగుతుండడంతో రైతులు, రైతు కూలీలు ఇంటిని వదలి బయటకు పోలేని పరిస్థితి నెలకొంది. పత్తితీత పనులు జోరుగా సాగుతున్న ఈ తరుణంలో తుపాన్ రావడంతో పత్తి పంట ఎర్రబారడంతోపాటు దూది నాణ్యత కోల్పోయే అవకాశం ఉంది. ఇక మిర్చి తోటలు ఏరివేత దశకు చేరుకున్నాయి. వానకాలం సాగు చేపట్టిన వరి పొలాలు సైతం చేతికొచ్చాయి. ఆయా గ్రామాల్లో కల్లాల్లో మిర్చి, ధాన్యం పంటను రైతులు నిల్వ చేసుకున్నారు. నిరంతరాయంగా వర్షం కురుస్తుండడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా యాతన పడ్డారు. వానముసురుతోపాటు ఈదురుగాలులు సైతం తోడుకావడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. దినసరి కూలీలు సైతం ఉదయం అడ్డాల వద్ద పెద్దగా కనపించలేదు. మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లాకు రెడ్‌అలర్ట్ జారీ చేశారు. మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.


అన్నపురెడ్డిపల్లి : పత్తి చేనులో నిలిచిన నీరు



### భారీగా వర్షపాతం నమోదు

సోమవారం ఉదయం నుంచి మంగళవారం సాయంత్రం వరకు నిరంతరాయంగా వర్షం కురవడంతో అదేస్థాయిలో వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నాటికి జిల్లావ్యాప్తంగా 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మధిర మండలంలో 24.2 మి.మీ, ఎర్రుపాలెం 21.4 మి.మీ, బోనకల్ 17.6 మి.మీ, వేంసూరు 13.4 మి.మీ, పెనుబల్లి 16.4 మి.మీ, చింతకాని 14 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం 9 గంటల తరువాత, సాయంత్రం భారీగా వర్షపాతం నమోదైంది. సత్తుపల్లి మండలం గంగారంలో 41.5 మి.మీ, వేంసూరులో 34.8 మి.మీ, పెనుబల్లి మండలంలో 22.3 మి.మీ, మధిర మండలంలో 21 మి.మీ, బోనకల్‌లో 17 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షం కురవడంతో సత్తుపల్లి ఓపెన్ కాస్టులో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. వివిధ పనుల నిమిత్తం నగరానికి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వస్తుంటారు. అయితే మంగళవారం నగరం బోసిపోయినట్లు కనిపించింది. దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు. రెండురోజుల అనంతరం పంటనష్టం అంచనా వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## సత్తుపల్లికి రెస్క్యూ బోటు

సత్తుపల్లి రూరల్, డిసెంబర్ 5 : మిచౌంగ్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సహాయక చర్యల కోసం ఉపయోగించేందుకు కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక చొరవతో ఇంప్లాటెడ్ రెస్క్యూ బోటును సిద్ధం చేశారు. విపత్తుల సమయంలో జిల్లాలో సత్వర సహాయక చర్యల కోసం ఒక్కో బోటును రూ.6లక్షల వ్యయంతో కొనుగోలు చేసి 20 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సత్తుపల్లికి ఈ బోటును తరలించారు. సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు బోటును ఉపయోగించనున్నట్లు సిబ్బంది తెలిపారు.


రెస్క్యూ బోట్‌తో సిబ్బంది


సత్తుపల్లిలో కురుస్తున్న వర్షం

## ఓసీల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

సత్తుపల్లి, డిసెంబర్ 5 : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మండల వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ఈ నేపథ్యంలో చేతికొచ్చిన వరి ధ్యాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్న రైతులు వర్షంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి జాగ్రత్త చర్యలు చేపట్టారు. మరోపక్క సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో నీరు నిలవడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. కిష్టారం ఓసీలో 5వేల టన్నుల బొగ్గు, 25వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులకు ఆటంకం కలిగింది. జేవీఆర్ ఓసీలో 25వేల టన్నుల బొగ్గు, 1.25లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీతకు ఆటంకం ఏర్పడినట్లు సింగరేణి అధికారులు తెలిపారు.


బూర్గంపాడు మండలం అంజనాపురంలో పాలంలో ఆరబోసిన ధాన్యంపై పరదాలు కప్పుకున్న రైతులు

## రైతన్నకు 'మిచౌంగ్' గండం

- జిల్లావ్యాప్తంగా మోస్తరు వాన
- తడిసి ముద్దవుతున్న ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు
- అత్యధికంగా అశ్వారావుపేటలో 35 మిల్లీమీటర్ల వర్షపాతం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ) : అకాల వర్షం రైతన్నల గుండెల్లో గుబులు పట్టిస్తున్నది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా మంగళవారం మోస్తరు వాన కురిసింది. గత రాత్రి నుంచి అంతటా వర్షం కురియడంతో చేతికందిన ధాన్యం పంట కల్లాల్లోనే తడిసి ముద్దవుతున్నది. మరోవైపు కోతకు వచ్చిన వరి పంట నేలరాలిపోయింది. పత్తి పంట కూడా వానకు తడిసి దూది రంగుమారే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతులకు తగు సూచనలు చేశారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రైతుల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అత్యవసరమైతే 08744,2419 50కి కాల్ చేయాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక అధికారులను అప్రమత్తం చేశారు. విద్యాసంస్థలకు కూడా సెలవు ప్రకటించారు.

### జిల్లాలో 11 మి.మీ వర్షపాతం

మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మోస్తరు వాన కురిసింది. అత్యధికంగా అశ్వారావుపేటలో 140 మిల్లీమీటర్లు, దమ్మపేటలో 88, పాల్వంచలో 14.2, టేకులపల్లిలో 13, అశ్వాపురంలో 12, కొత్తగూడెంలో 10 మిల్లీమీటర్ల వాన కురిసింది. సుమారుగా జిల్లావ్యాప్తంగా 11 మిల్లీమీటర్ల వర్షం పడింది. రైతులు అప్రమత్తమై పంట కల్లాల్లో ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పుకున్నారు. బూర్గంపాడు మండలం అంజనాపురంలో పంట కల్లాలో వేసిన వరికుప్పులు తడిసి ముద్దయ్యాయి.

### అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

తుపాన్ ప్రభావం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు వరితోపాటు పత్తి పంటకు కూడా నష్టం జరిగింది. పత్తి చేల్లో తీతకు వచ్చిన పత్తి వానకు తడిసి ముద్దయింది. వరి ధాన్యం పంట కల్లాల్లో తడవడంతో కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యాన్ని గోదాముల్లోకి తరలించాలని సూచించారు. టార్పాలిన్‌లు కూడా అందజేయాలన్నారు. తెల్లవారుజాము నుంచి వర్షం ప్రభావం ఎక్కువగా ఉండడంతో విద్యాసంస్థలకు కూడా సెలవు ప్రకటించారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులను బయటకు వెళ్లనివ్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.


పాల్వంచ బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు


కరకగూడెం మండలం అనంతారం గ్రామంలో ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పిన రైతులు


ఖమ్మం పట్టణంలో కురుస్తున్న వర్షం


ఖమ్మం నగరంలో ..


ఖమ్మం నగరంలో కురుస్తున్న వర్షంలో వ్యాపారులు



ఖమ్మం నగరంలో కురుస్తున్న వాన ముసురుకు ద్విచక్ర వాహనదారుల ఇబ్బందులు


మల్లారం వద్ద రహదారి పక్కన ఆరబోసిన ధాన్యం రాశులపై కప్పిన పరదా